
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
సోమవారం 1 జూలై 2024




రాజోలిలో పట్టు దారాలకు రంగులు అద్దుతున్న చేనేత కార్మికులు

విస్తరణపై ఆశలు


వాకిటి శ్రీహరి

- ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన సీఎం
- రాష్ట్రంలో ఆ వర్గం నుంచి గెలిచింది ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఒక్కరే..
- మొదటిసారి గెలవడంతోనే వరించనున్న అమాత్య పదవి
- మొదటి విడత మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లాలో జూపల్లి కృష్ణారావుకు చోటు
- పీసీసీ అధ్యక్ష పదవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆశలు


సంపత్ కుమమార్

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌ను ఓడించి.. కాంగ్రెస్ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మరో పది మంది మంత్రులు ఆయన వెంటనే పదవీ బాధ్యతలు చేపట్టారు. మరికొన్ని పోర్ట్‌ఫోలియోలు ఖాళీగా ఉండటంతోపాటు ఆశావహులు ఎక్కువగా ఉండటంతో మొదటి విడతలో పూర్తిస్థాయి కేబినెట్ కొలువు దీరలేదు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రెండు మంత్రి పదవులు వస్తుండగా.. మొదటి విడత కేబినెట్‌లో జూపల్లి కృష్ణారావు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గాను 12 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీగా పని చేసినప్పటికీ.. ఎమ్మెల్యేగా గెలవడం ఇదే మొదటిసారి. ఉమ్మడి జిల్లా కోటా కింద అటు రేవంత్‌కు ఏకంగా సీఎం పదవి రావడం, జూపల్లికి మంత్రి పదవి రావడంతో ఇక కేబినెట్ బెర్తులు ఉండకపోవచ్చని అందరూ భావించారు. అయితే పార్లమెంట్ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పంద్రాగస్టులోపు ముదిరాజులకు మంత్రి పదవి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచింది మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాత్రమే కావడం గమనార్హం. ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సీఎం ఢిల్లీ పెద్దలతో దాదాపు చర్చలు పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. అయితే మిగిలిన బెర్తుల్లో కూడా పూర్తిగా విస్తరించే అవకాశం లేనట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే హామీ ఇచ్చిన నేపథ్యంలో శ్రీహరిని త్వరలోనే మంత్రి పదవి వరించనుందని తెలుస్తోంది.

అనుయాయుడికి అందలం..

ఈసారి ఉమ్మడి జిల్లాలో చాలామంది మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిలో నలుగురు మినహా మిగతా ఎనిమిది మంది కొత్తవారే. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోటాలో ఇప్పటికే జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి దక్కింది. ఇక మిగిలింది కేవలం మహబూబ్‌నగర్ కోటా మాత్రమే. ఇక్కడ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ.. స్థానిక సమీకరణలు, గత హామీల దృష్ట్యా ఈసారి నారాయణపేట జిల్లాకు ప్రాధాన్యం దక్కనుంది. అక్కడి నుంచి గెలిచిన వారిలో ఇప్పటివరకు మంత్రి పదవి ఎవరూ చేపట్టలేదు. అలాగే ముదిరాజ్‌ల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ వర్గాన్ని పోలరైజ్ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగా పార్లమెంట్ ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చినప్పటికీ, బీజేపీ వైపు ఓటర్లు ఎక్కువగా ఆసక్తి చూపడంతో అనుకున్న ఫలితాలు రాలేదు. అయితే భవిష్యత్‌లో ఏదో ఒక వర్గం కాంగ్రెస్ పార్టీవైపు ర్యాలీ కావాలని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రస్తుత మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి టికెట్ వస్తుందా? లేదా అనే సందేహాలు గత ఎన్నికల సమయంలో ఉన్నాయి. ఈ స్థానం నుంచి ఎక్కువ మంది టికెట్ ఆశించడం, శ్రీహరికి ఆర్థికబలం తక్కువగా ఉండటంతో ప్రత్యర్థులను ఢీకొట్టగలుగుతాడా? లేదా అనే సందేహాలు పార్టీలో వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు, కర్ణాటకలోని కొందరు కాంగ్రెస్ పెద్దల సహకారంతో శ్రీహరికి టికెట్ లభించింది. అటు రేవంత్‌రెడ్డి అనుయాయుడిగా ఉండటం.. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉండటంతో మొదటిసారి గెలవడంతోనే శ్రీహరికి మంత్రి పదవి దక్కనుంది.

పీసీసీపై సంపత్ దృష్టి..

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్‌కుమార్ పీసీసీ అధ్యక్షుడిగా తనను నియమించాలని ఆశిస్తున్నారు. 2014 నుంచి 2018 వరకు అలంపూర్ అసెంబ్లీ నుంచి ప్రాతినిధ్యం వహించిన సంపత్‌కుమార్.. 2023లో కూడా అదే స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేయాలని భావించారు. కానీ అధిష్ఠానం ఆ టిక్కెట్‌ను డాక్టర్ మల్లు రవికి కేటాయించింది. ఈ క్రమంలో సంపత్‌కుమార్ పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ అధ్యక్షుడి రేసులో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ కూడా ఉన్నారు. అయితే సంపత్ తనకున్న పరిచయాలతో పీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి వెంట సంపత్‌కుమార్ కూడా వెళ్లారు. అక్కడ పార్టీ ప్రెసిడెంట్ పదవితోపాటు మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో సీఎం చర్చించినట్లు తెలుస్తోంది. సంపత్‌కుమార్‌ను పీసీసీ పదవి వరిస్తుందా? లేదా వేచి చూడాలి.

నిధులున్నా.. నిర్లక్ష్యం


రాజోలిలో మగ్గంపై పట్టు చీరను తయారు చేస్తున్న కార్మికులు

- ప్రారంభం కాని చేనేత క్లస్టర్లు
- ఉమ్మడి జిల్లాకు గత ఏడాది ఆరు మంజూరు
- ఈ ఏడాది జోగులాంబ గద్వాలకు మరొకటి
- రూ.6.71 కోట్ల నిధులు కేటాయింపు
- వాటితో కార్మికులకు నైపుణ్య శిక్షణ
- 90 శాతం సబ్సిడీపై ఇవ్వనున్న యంత్రాలు

రాజోలి, జూన్ 30: చేనేత కార్మికులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద ఉమ్మడి జిల్లాకు 2023 ఫిబ్రవరిలో మంజూరైన ఏడు క్లస్టర్లు నేటికీ ప్రారంభం కావడం లేదు. వాటి ఏర్పాటుకు రూ.6.71 కోట్లు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మొదటి విడత నిధులు అటు మహబూబ్‌నగర్, ఇటు జోగులాంబ గద్వాల జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు జమ అయ్యాయి. నిధులు మంజూరై ఏడాది గడిచినా అధికారులు సర్వేలతో కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభించడం లేదు. ఈ క్లస్టర్లు ప్రారంభం అయితే కార్మికులు వృత్తిలో నైపుణ్యం పొందడంతో పాటు అధునాతన పరికరాలు 90 శాతం సబ్సిడీపై పొందుతారు. ఆ తర్వాత శిక్షణ సమయంలో ఉపకార వేతనం ఇవ్వనుండటంతో ఉపాధి పొందే అవకాశం పొంది.

జోగుళాంబ గద్వాల జిల్లాకు నాలుగు

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2,500 మగ్గాలు ఉన్నాయి. జిల్లాకు నాలుగు క్లస్టర్లు మంజూరు అయ్యాయి. మొదటి విడతగా గద్వాల క్లస్టర్ పరిధిలో 272 మంది చేనేత కార్మికులకు రూ.94 లక్షలు, గట్టు క్లస్టర్ పరిధిలో 564 మందికి రూ.1.60 కోట్లు, రాజోలి క్లస్టర్ పరిధిలో 400 మంది కార్మికులకు రూ.1.30 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అధునాతన యంత్రాల వాడకం, డిజైన్లు, పట్టుదారాలకు రంగులు అద్దడంపై శిక్షణ ఇవ్వనున్నారు. వారి మగ్గాలకు అవసరమైన మోటార్ జాకార్డులు, ఫ్రేమ్ మగ్గాలు, జాకార్డు లిఫ్టింగ్ యంత్రాలను ప్రభుత్వం 90 శాతం రాయితీతో అందిస్తుంది. 10 శాతం కార్మికులు చెల్లించాల్సి ఉంది. గద్వాల క్లస్టర్‌కు సంబంధించి కార్మికులను డిప్ పద్ధతి ద్వారా ఎంపిక చేసి, సబ్సిడీపై యంత్రాలను అందించేందుకు 10 శాతం వాటా తీసుకుంటున్నారు. గట్టు క్లస్టర్ సర్వే కొంత పూర్తి కాగా, సీడీఈ సెలవుల్లో వెళ్లడంతో మధ్యలోనే నిలిచిపోయింది. రాజోలిలో సర్వే చేసి 400 మందిని ఎంపిక చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అలంపూర్, రాజోలికి కలిపి ఈ ఏడాది మేలో మంజూరైన క్లస్టర్‌కు డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌ను నియమించాల్సి ఉంది.


అమ్ముడుపోని పట్టు చీరలు

కష్టకాలంలో క్లస్టర్‌తో ఉపాధి..

ప్రస్తుతం పెళ్లిళ్లు లేకపోవడంతో కార్మికులు తయారు చేసిన పట్టు చీరలు అమ్ముడుపోవడం లేదు. దాంతో పెట్టుబడులు భారమై.. ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరాకీ కావడం లేదని నేసిన చీరలకు మాస్టర్ వీవర్స్ కడాఆ సగం డబ్బులే ఇస్తున్నారని కార్మికులు చెబుతున్నారు. మిగతా సగం సీజన్ ప్రారంభమై అమ్ముడు పోయాక ఇస్తామని అంటున్నారని తెలుపుతున్నారు. ఫలితంగా కార్మికులకు జీవనాధారం కష్టంగా మారింది. ఈ సమయంలో క్లస్టర్‌లను ప్రారంభిస్తే తమకు మేలు జరుగుతుందని అంటున్నారు.

పట్టు చీరలకు గిరాకీ తగ్గింది



మార్కెట్‌లో పవర్‌లూమ్‌లతో తయారు చేసిన చీరలు అధికం కావడంతో చేనేత కార్మికులు కష్టపడి తయారు చేస్తున్న పట్టు చీరలకు గిరాకీ తగ్గింది. ఇప్పుడు అన్‌సీజన్ కావడంతో చీరలు అమ్ముడుపోవడం లేదు. పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కార్మికులకు నైపుణ్యం చాలా అవసరం. క్లస్టర్‌ను ప్రారంభించి, కార్మికులకు ఉపాధి కల్పించాలి.

- కె.నాగరాజు, చేనేత కార్మికుడు, రాజోలి

క్లస్టర్‌ను త్వరగా ప్రారంభించాలి



రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు అధికంగా ఉన్న రాజోలిలో క్లస్టర్‌ను త్వరగా ప్రారంభించాలి. కార్మికులకు శిక్షణ అందించాల్సిన అవసరం చాలా ఉంది. సర్వే పేరుతో నెలలు గడుస్తున్నా క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం లేదు.

- బి.గోపాల్, చేనేత కార్మికుడు, రాజోలి

యంత్రాలు వచ్చాక శిక్షణ ఇస్తాం



గద్వాల జిల్లాకు మూడు క్లస్టర్‌లు మంజూరు అయ్యాయి. గద్వాల క్లస్టర్ ప్రారంభం అయ్యింది. లబ్ధిదారులకు యంత్రాలు అందిస్తాం. గట్టు క్లస్టర్‌కు సీడీఈ వచ్చి, వెళ్లిపోయారు. రాజోలి క్లస్టర్ కూడా సర్వే పూర్తి అయ్యింది. త్వరలో డిప్ పద్ధతిలో కార్మికులను ఎంపిక చేస్తాం. ప్రభుత్వం నుంచి మోటరైజ్డ్ జా కార్డులు, యంత్రాలు వచ్చాక కార్మికులకు శిక్షణ ప్రారంభిస్తాం. శిక్షణ అనంతరం లబ్ధిదారుల నుంచి 10 శాతం వాటా వసూలు చేసి, యంత్రాలు అందిస్తాం. ఇటీవల అలంపూర్, రాజోలి కలిసి మరో క్లస్టర్ మంజూరు అయ్యింది.

- గోవిందయ్య, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు, జోగుళాంబ గద్వాల జిల్లా

అధికారులు లేని విద్యాశాఖ

- ఉమ్మడి జిల్లాలో 78 మండలాలకు ఎనిమిది మందే రెగ్యులర్ ఎంఈవోలు
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఒక్కరూ లేరు
- హెచ్‌ఎంలకు ఇన్‌చార్జీ అధికారులుగా బాధ్యతలు
- ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు మండలాలు


కంబాళాపురం ప్రభుత్వ పాఠశాల

వనపర్తి అర్బన్, జూన్ 30: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యాశాఖకు అధికారులు కరువయ్యారు. జిల్లాల పునర్విభజన నాటి నుంచి చాలా మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడం గమనార్హం. ఐదు జిల్లాలో 78 మండలాలు ఉండగా.. కేవలం ఎనిమిది మండలాలకే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒక్క రెగ్యులర్ విద్యాధికారి కూడా లేరు. ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో స్కూళ్లపై పర్యవేక్షణ కొరవడింది. దాంతో ఈ నెలలో చేపట్టిన బడిబాట కార్యక్రమం కూడా నామమాత్రంగా నిర్వహించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో 2,500 పాఠశాలలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2500లకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మండలాలకు రెగ్యులర్ విద్యాధికారులు లేకపోవడంతో పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దాంతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పాఠశాలలను నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. చాలా ప్రైవేట్ పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇరుకిరుకు గదుల్లో తరగతి గదులు నిర్వహిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఎంఈవోల కొరతతో ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. వనపర్తి జిల్లాలో 15 మండలాలు ఉండగా ఒక్కరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోగా కొనసాగుతున్నారు. నారాయణపేట జిల్లాలో కూడా ఒక్కరే రెగ్యులర్ అధికారి ఉండగా.. ఆయన కూడా ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. గద్వాల జిల్లాలో 13 మండలాలకు గాను ఒక్క మండలానికీ రెగ్యులర్ విద్యాధికారి లేరు. మహబూబ్‌నగర్ జిల్లాలో 17 మండలాలకు గాను చిన్నచింతకుంట, గండీడ్ మండలాలకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో బల్మూర్, కల్వకుర్తి, వంగూరు, తిమ్మాజిపేట మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. హెచ్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా రెండు నుంచి మూడు మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. దాంతో వారు అటు రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలకు, ఇటు మండల విద్యాధికారులుగా ఎక్కడా విధులకు న్యాయం చేయలేకపోతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో కొనసాగుతున్న పనులపైనా పర్యవేక్షణ కరువైంది. రెగ్యులర్ ఎంఈవోలను నియమించి, విద్యాశాఖను గాడిన పెట్టాలని ప్రజలు, విద్యావేత్తలు కోరుతున్నారు.

వర్షం.. హర్షం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురిసిన వాన
- ఆరు తడి పంటలకు మేలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


భూత్పూర్‌లో పత్తి చేనుకు దంతె కొడుతున్న రైతు

నారాయణపేట/గద్వాల/వనపర్తి రాజీవ్‌చౌరస్తా/తాడూరు, జూన్ 30: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు మోస్తరుతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా ధన్వాడ మండలంలో 25 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, నర్వ మండలంలో 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దామరగిద్దలో 8, మక్తల్‌లో 5.8, ఊట్కూర్‌లో 1.8, నారాయణపేటలో 11.6, మరికల్‌లో 6.4, మాగనూర్‌లో 10.2, మద్దూర్‌లో 16, ఊట్కూర్‌లో 1.8, కోస్గి మండలంలో 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో పత్తి, కంది, పెసర పంటలకు ఊరట లభించింది. బోర్ల కింద వరి సాగు చేసే రైతులు నారుమళ్ల కోసం కరిగేట చేస్తున్నారు. తుకం కోసం మొలక చల్లుతున్నారు.

జోగుళాంబ గద్వాలలో..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. పది రోజులుగా కేటీదొడ్డి, గట్టు, వడ్డేపల్లిలో మినహా ఎక్కడ పెద్దగా వర్షం కురవలేదు. ఆదివారం సాయంత్రం గద్వాలతో పాటు, కేటీదొడ్డి, ధరూర్, ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.


వానకు పచ్చగా మారిన జొన్నచేను

ఖిల్లాఘణపూర్‌లో 25.8 మి.మీ వర్షపాతం

వనపర్తి జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం వరకు వర్షం కురిసింది. ఖిల్లా ఘణపురం మండలంలో గరిష్ఠంగా 25.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా ఆత్మకూరు మండలంలో 1.5 మిల్లీ మీటర్లు వాన కురిసింది. పెద్దమందడి మండలంలో 16.5, మదనాపురంలో 7.3, చిన్నంబావిలో 6.5, కొత్తకోటలో ఆరు, పానుగల్‌లో 5.8, గోపాల్‌పేటలో ఐదు, అమరచింతలో 3.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. ఆ సమయంలో కరెంటు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదు.

ప్రాణం పోసిన వాన

పాలమూరు/భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం వర్షం కురిసింది. ఈ వర్షంతో ఆరుతడి పంటలైన పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది పంటలకు ఊరట లభించింది. దాంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు వారాల నుంచి వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో వర్షం పడకపోతే మొలకలు ఎండిపోయే ప్రమాదం ఉండగా.. ఈ వాన ఊపిరి పోసింది. జిల్లాలో శనివారం ఒక్క రోజే 226.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక్కో మండలంలో సగటున 13.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఏడు మండలాల్లో అధికంగా, ఏడు మండలాల్లో సాధారణంగా, మూడు మండలాల్లో మామూలు వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో 15 రోజుల వరకు పంటలకు భరోసా దక్కినట్లేనని రైతులు అంటున్నారు. జిల్లాలో జూన్ మొదటి వారంలో వర్షం పడగా, ఆ తర్వాత పడలేదు. జూన్ సాధారణ వర్షపాతం 65.9 మిల్లీ మీటర్లుకాగా, 83.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. భూత్పూర్ మండలంలో వానకు పొలాల్లో దంతె కొట్టడంతో పాటు కలుపు తీత పనులు చేపట్టారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దాంతో ఆరు తడి పంటలు వేసి 25 రోజులుగా వాన కోసం ఎదురు చూస్తున్న రైతులు ఊరట చెందారు. జిల్లాలోని 20 మండలాలకు గాను బిజినేపల్లి, నాగర్‌కర్నూల్, తిమ్మాజిపేట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. బిజినేపల్లి మండలంలో 45.2 మిల్లీ మీటర్లు, నాగర్‌కర్నూల్‌లో 34.8, తిమ్మాజిపేటలో 29.6, తాడూరులో 24, ఊర్కొండలో 22.6, వెల్దండలో 32.4, కల్వకుర్తిలో 13.8 మిల్లీ మీటర్ల వాన పడింది. ఉప్పునుంతలలో 10.2, తెలకపల్లిలో 24.2, అచ్చంపేటలో 22.6, అమ్రాబాద్‌లో 18.6, పదరలో 13 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన పెంట్లవెల్లి, కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, లింగాల, బల్మూరు, వంగూరు, చారకొండ మండలాల్లో అంతంత మాత్రంగానే వర్షం కురిసింది.

ప్రతీ ఎకరాకు నీరందిస్తాం

- రిజర్వాయర్ల ద్వారా చెరువుల, కుంటలను నింపాలి
- కేఎల్‌ఐ కాల్వల్లో పేరుకుపోయిన జమ్మును తొలగించాలి
- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం


పెద్దకార్పాముల శివారులో కేఎల్‌ఐ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

పెద్దకొత్తపల్లి, జూన్ 30: కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లి, దేదినేనిపల్లి, యాపట్ల తదితర గ్రామాల పొలాలకు ప్రాజెక్టు ద్వారా నీరు సరఫరా కావడం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదివారం పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న కేఎల్‌ఐ కాల్వలను మైనర్ ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు మ్యాప్‌ను చూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేఎల్‌ఐ కాల్వల్లో ఉన్న జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లను నీటితో నింపి, పెద్దకొత్తపల్లి మండలంలోని 18,016 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లు నిండే వరకు మోటార్లను ఆపొద్దని అధికారులకు చెప్పారు. అధికారులు రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ చెరువు, కుంటల తూములు మూసి, నీటితో నింపాలన్నారు. కేఎల్‌ఐ డిస్ట్రిబ్యూటర్, మైనర్ సబ్ డిస్ట్రిబ్యూటర్ల వెంట ఉన్న రోడ్డును చెడగొట్టిన వారిపై కేసులు పెట్టించాలన్నారు. అనంతరం పెద్దకార్పాములలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజాపాలన సాగిస్తుందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు.

మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులోని మైసమ్మ దేవతను మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరమైన నిధులు సమకూర్చి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఈఈ రవీందర్, డీఈ విజయలక్ష్మీ, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలో ఘటన
- మృతుడు గోపాల్‌పేట వాసి


లక్ష్మయ్య(ఫైల్)

గోపాల్‌పేట, జూన్ 30: పొట్టకూటి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వలస వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఆయిలమెని లక్ష్మయ్య(60) ఆంధ్రపదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా- దర్శి మండల కేంద్రంలో వంట పని కోసం తన బామ్మర్ది(కుర్మయ్య)తో కలిసి వెళ్లాడు. స్వగ్రామంలో ఉన్నప్పుడు లక్ష్మయ్యకు రోజూ కల్లు తాగే అలవాటు ఉన్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన రెండు రోజుల నుంచి కల్లు లేకపోవడంతో వింతగా ప్రవర్తించేవాడు. పిచ్చిపిచ్చిగా చేస్తూ 42 రోజుల క్రితం దర్శిలో తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు, కుర్మయ్యతో కలసి దర్శి మండలంలో వెతికారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం దర్శి మండల సమీపంలో ఓ పొలం బావి వద్ద మృతదేహాన్ని చూసిన బాటసారులు పోలీసులకు సమాచారం అదించారు. పోలీసులు కుర్మయ్యను తీసుకెళ్లి చూపగా మృతదేహం లక్ష్మయ్యదే అని నిర్ధారించారు. మృతదేహనికి పంచనామా చేసి స్వగ్రామానికి తీసుకొస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పేటను సస్యశ్యామలం చేస్తా

- పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికై పోరాడుతా
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి


ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

నారాయణపేట టౌన్, జూన్ 30 : నారాయణపేట జిల్లాను సస్యశ్యామం చేసేందుకు, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు శాసన మండలిలో నా గళాన్ని వినిపిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ సన్మాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు లేకపోయినా అధికారం ఉందన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిని నిలబెట్టిందన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిదులు ఏ మాత్రం తలొగ్గకుండా తనకు ఓటు వేసి గెలిపించారన్నారు. సీఎం సొంత జిల్లాలోనే మొదటి ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందన్న విషయాన్ని సీఎం గుర్తించుకోవాలన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బలాంటిదన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సహకారం అందిస్తానన్నారు.

అధికార పార్టీ ప్రలోభాలకు లొంగలేదు : మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ కష్టకాలంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నవీన్‌కుమార్ రెడ్డి ముందుకు వచ్చాడన్నారు. అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసినా తలొగ్గకుండా పోటీ చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ ఓటర్లు బీఆర్ఎస్ ఉన్నందుకే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపేందుకు ముందుకు రాలేదన్నారు. శాసనమండలిలో నారాయణపేట జిల్లా సమస్యలపై మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని దామరగిద్ద, ధన్వాడ, నారాయణపేట, మరికల్, కోయిల్‌కొండ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్సప్ప, సురేఖ, అంజలి, లావణ్య, శిరీష, గురులింగం, సుదర్శన్‌రెడ్డి, విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తఖీచాంద్, భీమయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, సురేదంర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయం సందర్శన


ఆలయ ప్రాంగణంలో చెంచు మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కొల్లాపూర్, జూన్ 30: సప్తనదుల సంగమ క్షేత్రం సంగమేశ్వరాలయాన్ని తన ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సందర్శించారు. సంగమ క్షేత్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్యశర్మ ఆలయ విశిష్టతను తీన్మార్ మల్లన్నకు క్లుప్తంగా వివరించారు. నదీ పరివాహ ప్రాంతాన్ని పురాతన ఆలయాన్ని సందర్శించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న చెంచు మహిళను చూసి వారి ఆర్థిక పరిస్థితి, స్థితిగతులను తెలుసుకుని తనవంతు సహాయం చేశారు. చెంచు మహిళ చెప్పిన కష్టాలు వినడానికి బాధాకరంగా ఉందన్నారు. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ వీరి జీవన విధానం ప్రశ్నార్థకంగానే మిగిలిందని తీన్మార్ మల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు.

మోట్లంపల్లిలో గొర్రెలు చోరీ

ఆత్మకూరు, జూన్ 30: మండలంలోని మోట్లంపల్లిలో 17 గొర్రెలు, ఒక మేకపోతును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గొర్రెల పెంపకం యజమాని మణివర్ధన్‌రెడ్డి తెలిపారు. మోట్లంపల్లి శివారులోని తమ తోటలో రోజువారిగా గొర్రెలను మేపుతూ రాత్రిపూట గొర్రెల షెడ్డులో ఉంచేవారు. శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో వర్షం రావడంతో ఇంటికి వచ్చారు. అదే అదునుగా భావించిన దొంగలు గొర్రెలను తస్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై జూరాల శ్రీరామ్‌నగర్ స్టేషన్ రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా శనివారం అర్ధరాత్రి ఒక బొలెరో వాహనం స్టేషన్ రోడ్డుకు వెళ్లినట్లుగా గుర్తించారు. సుమారుగా గొర్రెల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ నరేందర్ తెలిపారు.

తీగ లాగితే కదిలిన డొంక!

- కరుడుకట్టిన నేరస్థుడిని పట్టించిన బస్ టికెట్
- ఒక కేసు దర్యాప్తు చేసే క్రమంలో మరో ఐదు హత్యలు వెలుగులోకి..
- సీరియల్ కిల్లర్ కేసు ఛేదించిన పోలీసులపై ప్రశంసలు

మహబూబ్‌నగర్, జూన్ 30 : తీగలాగితే డొంక కదిలినట్లు సీరియల్ కిల్లర్ కేసు దర్యాప్తు విషయంలోనూ అదే జరిగింది. సాధారణ కేసుగా దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు చిన్న క్లూ ఆధారంగా కేసును ఛేదించారు. చివరకు హంతకుడు సీరియల్ కిల్లర్ అని తేలడం సంచలనంగా మారింది. కీలక కేసును దర్యాప్తు చేసి కరుడుకట్టిన నేరస్థుడిని కటకటాలకు పంపించిన పోలీసులపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఐదుగురు మహిళలు, ఓ పురుషుడిని హత్యచేసిన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన బోయ కాశీం కేసు దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. గతనెల 25న భూత్పూర్ మండలం అమిస్తాపూర్ శివారులో ఓ మహిళ హత్యకు గురైన విషయాన్ని పోలీసుల గుర్తించారు. ఆమెకు సంబంధించిన వివరాలేవీ తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పది రోజులైనా ఆమె ఎవరో తెలియలేదు. చివరకు పోలీసులకు మృతురాలి దుస్తులను వెతకకగా ఓ బస్‌టికెట్ లభించింది. దాని వెనకాల ఓ ఫోన్ నెంబర్ ఉండటంతో ఆ నెంబర్ ఆధారంగా కేసు దర్యాప్తు మొదలుపెట్టారు. ఆ నెంబర్‌కు ఫోన్ చే సి అతన్ని పిలిపించారు. మృతురాలు తన బంధువని గుర్తుపట్టారు. చనిపోవడానికి ముందు, అంతకుముందు మృతురాలు అతనికి డబ్బుల విషయంలో పలుమార్లు ఫోన్ చేసింది. ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరి నుంచి ఫోన్ చేసింది ఆ కాల్స్ అన్నింటిని పోలీసులు వెతుక్కుంటూ పోగా చివరకు ఓ వ్యక్తి తన వద్దకు ఓ మగమనిషి, మహిళ వచ్చారని, తన ఫోన్‌తో మహిళ ఎవరికో ఫోన్ చేసిందని, ఆమె వెంట వచ్చిన వ్యక్తి మాకు తెలిసిన వాళ్ల ఫోన్ దొంగిలించాడని చెప్పాడు. ఆ ఫోన్‌కు ఫోన్ చేయగా తనకు డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో డబ్బులు ఇస్తామని అతన్ని పిలిపించి కొంత డబ్బు ఇచ్చి ఫోన్ లాక్కున్నామని, అప్పుడు అతని ఫొటో కూడా తీసుకున్నామని చెప్పాడు. అతని ఊరు తమకు చింతలకుంటగా చెప్పాడని, ఫోన్ రికార్డులు కూడా పోలీసులకు ఇవ్వడంతో అతని గ్రామానికి వెళ్లి విచారించారు. అతని పేరు కాసీం అని ఊర్లోనుంచి వెళ్లి చాలా రోజులవుతుందని చెప్పడంతో పోలీసులు అతని ఫొటోను పట్టణంతో పాటు, భూత్పూర్, జడ్చర్లలో అతికించి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అతన్ని పట్టుకుని విచారించగా, మిగతా ఐదు హత్యల విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముందుగా మామూలు కేసుగా దర్యాప్తు సాగించిన భూత్పూర్ సీఐ రామకృష్ణ చివరకు సీరియల్ కిల్లర్ అని తేలడంతో అన్ని కోణాలలో దర్యాప్తు చేసి నిందితుడిని కటకటాలకు పంపించారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా పనిచేసిన సీఐ, అతని బృందాన్ని పోలీస్ బాస్ అభినందించారు. గతంతో 16 హత్యలు చేసిన సీరియల్ కిల్లర్ ఎరుకలి శ్రీను కేసును కూడా అప్పట్లో భూత్పూర్ పోలీసులే ఛేదించడం గమనార్హం.

గంగాపురానికి పిజ్వారం పీఠాధిపతి


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న పిజ్వారం పీఠాధిపతి స్వామి

జడ్చర్ల, జూన్ 30 : జడ్చర్ల మండలంలోని గంగాపురం మలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమాన్ని ఆదివారం పిజ్వారం పీఠాధిపతి స్వామి వారు సందర్శించారు. ఆశ్రమంలోని లక్ష్మీనారాయణస్వామి, అమ్మవారికి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమానికి వచ్చిన పీఠాధిపతికి ఆశ్రమం నిర్వాహకులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో శ్రీపరమాత్మ నందగిరి స్వామి, వెంకట్‌చరణ్‌స్వామి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి


మృతి చెందిన ఆవులు

మిడ్జిల్, జూన్ 30 : సంత నుంచి ఇంటికి తీసుకొచ్చిన ఆవులు మృతి చెందడంతో రైతు కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మండలంలోని వస్పుల గ్రామానికి చెందిన శ్రీశైలం పశువుల సంతకు వెళ్లి రెండు ఆవులను రూ. లక్ష ముప్పై వేల రూపాయలకు కొనుగోలు చేసి వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఆవులు తాడును తెంచుకొని పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం వ్యవసాయపొలం వద్దకు వెళ్లి రైతు చూడగా రెండు ఆవులు మృతి చెందినట్లు తెలిపారు. నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

ఒకే ఇంట్లో ఐదుగురు డాక్టర్లు



కుటుంబ సభ్యులతో వీరభద్రప్ప

నారాయణపేట టౌన్, జూన్ 30 : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది. ఎదుటి వ్యక్తి ప్రాణాలు కాపాడే తపన ఉన్న వాడే నిజమైన వైద్యుడు. అలాంటి వృత్తిలో తన కుటుంబ సభ్యులు రాణించాలన్నదే ఆయన తపన అందుకే ఆయన కూతురు, కుమారుడిని డాక్టర్లను చేయడంతో పాటు కోడళ్లు, అల్లుడిని సైతం డాక్టర్లనే ఎన్నుకున్నారు. నేడు డాక్టర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన వీరభద్రప్ప, సుజాత దంపతులకు ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూతురు డాక్టర్ పవిత్ర డెర్మటలాజీ, అల్లుడు డాక్టర్ వం శీకృష్ణ కార్డియాలజిస్టుగా ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ఇదే ఆసుపత్రిలో కోడలు డాక్టర్ సురేఖ సైక్రియాటిస్టుగా పని చేస్తోంది. ఈ ఆసుపత్రి మేనేజ్‌మెంట్ కుమారుడు వినయ్ చూసుకుంటున్నారు. మరో కుమారుడు డాక్టర్ విజయ్ గ్యాస్ట్రోలజీగా హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. కోడలు మౌనిక పిడియాట్రిషియన్‌గా లోటస్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఇలా ఒకే ఇంట్లో ఐదుగురు మంది డాక్టర్లు కావడం ఆ కుటుంబానికి గర్వకారణం అని చెప్పవచ్చు. కాగా వీరభద్రప్ప 1985లో వైద్యశాఖలో లెప్రసీ ఆసుపత్రిలో ఏపీఎంవోగా విధుల్లో చేరారు. దాదాపు 39 సంవత్సరాలు వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. 12 ఏళ్లుగా పక్షపాతంతో బాధపడుతున్నారు. డిసెంబర్‌లో రిటైర్‌మెంట్ కానున్నారు. తాను వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్నందుకు గానూ తన పిల్లలను కూడా వైద్యులుగా పేద ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య వృత్తిలో రాణింపజేయడం జరిగిందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్



జడ్చర్లలో మొక్కలు నాటుతున్న కృష్ణసాగర్

జడ్చర్ల, జూన్ 30 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకై చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం, వాసవీకల్యాణ మండపం, డిగ్రీ కళాశాల, మునిసిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటి, రక్షించాలని, మానవ మనుగడలో మొక్కల ప్రాధాన్యత ఎంతో ఉందని పేర్కొన్నారు. అనంతరం జడ్చర్ల నుంచి రాజాపూర్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు ప్రణీల్‌చందర్, కౌన్సిలర్ సతీష్, దాచేపల్లి చంద్రయ్య, రంజిత్ బాబు, సాహితిరెడ్డి, గోవర్ధన్, సత్యం, శ్రీనివాస్, బొటానికల్ గార్డెన్ కోఆ ర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య, నారాయణ, మల్లేష్, తరుణ్, గోపీనాథ్, సుధాకర్ ఉన్నారు.

పంట పొలంలో కంచె కూల్చివేత



కూల్చిన కంచె

గోపాల్‌పేట, జూన్ 30: మండలంలో ఓ పొలం దగ్గర ఏర్పాటు చేసిన హద్దు కంచెను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏదుల గ్రామనికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి రిటైర్డ్ ఆర్మీ గ్రామ శివారులో ఉన్న తన పొలం దగ్గర 20 రోజుల క్రితం సిమెంట్ కడ్డీలకు జాలి ఏర్పాటు చేయించుకున్నాడు. అదివారం ఉదయం పొలం దగ్గరకి వెళ్లిచూస్తే కడ్డీలను జాలిని ధ్వంసం చేశారు. వెంటనే శ్రీనివాస్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 30 : భర్త జంగిటి కురుమూర్తి వేధిస్తున్నాడని భార్య జంగిటి మంజుల నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.... నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన కురుమూర్తి మంజులను 27ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే గత పదేళ్లుగా భార్య దగ్గరికి రాకుండా వేరే ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఉంటున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మంజుల తన అత్తమామల దగ్గర తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఉంటుంది. ఇటీవల తన భర్త కాపురానికి రాకుండా ఉండడంతో అతనితో విడాకులు కావాలని కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. దీంతో కోపోద్రిక్తుడైన కురుమూర్తి ఇంటికొచ్చి దాడి చేసి వేధిస్తున్నాడని మంజుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

కాపురానికి తీసుకపోవడం లేదని దాడి

- నలుగురిపై కేసు నమోదు

ఉప్పునుంతల, జూన్ 30 : భార్యను కాపురానికి తీసుకపోవడం లేదని భర్తపై దాడి చేసిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని జయరాంతండా గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూర్ గ్రామానికి చెందిన రామావత్ లక్ష్మణ్ తన మేనమామ బీమ్లా నాయక్ మృతి చెందడంతో జయరాంతండాకు వచ్చారు. బీమ్లానాయక్ తమ్ముడు కూతురు జయమ్మను లక్ష్మణ్ కాపురానికి తీసుకపోవడం లేదని నరేష్, సురేష్, జయమ్మ, మత్రు కలిసి లక్ష్మణ్‌పై దాడి చేశారు. అతడి తలకు గాయాలయ్యాయి. గొడవ వద్దని లక్ష్మణ్ బావ ఇస్లావత్ మోతీలాల్ అక్కడి నుంచి తీసుకెళుతుండగా సదరు వ్యక్తులు నలుగురు కలిసి మోతీలాల్‌పై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటి సంపులో పడి వృద్ధుడి మృతి

తెలకపల్లి, జూన్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గడ్డంపల్లిలో ఆది వారం నీటి సంపులో పడి వృద్ధుడు మృతి చెం దిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సం బంధించిన వివరాలు గ్రామస్థుల కథనం ప్రకారం... పర్వతాలు (75) అనే వృద్ధుడు ఇంటి ముందున్న సంపులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

కొత్తకోట, జూన్ 30: పట్టణంలోని శిశుమందిర్ కాలనీలో కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. కాలనీకి చెందిన ఖాజా వ్యాపార నిమిత్తం ఆరు గొర్రె పిల్లలను తీసుకొచ్చి ఇంటి ఆవ రణలో ఉంచారు. వీధి కుక్కలు దాడి చేసి గొర్రె పిల్లను చంపేశాయి. వీటి విలు వ రూ. 80వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. వీధుల్లో కుక్కలు పెరిగిపోయావని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం లేదని వాపోయారు.

ఉచితం ఉందా.?

- గతేడాది ఉచితంగా చేపపిల్లల పంపిణీ
- ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయమే తరువాయి
- స్పష్టత ఇస్తేనే పంపిణీ

పాలమూరు, జూన్ 30 : వానాకాలం ప్రారంభమై నెలరోజులు కావస్తోంది. వర్షాలు ఊపందుకుంటే ఈరోజు, రేపు చెరువులు నిండుతాయి. అనంతరమే మత్స్యకారులు చెరువుల్లో చేపల సాగుకు సిద్ధమవుతారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చినట్లు ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందా..?, లేదా..? అనే దానిపై మత్స్యకారులకు అనుమానం నెలకొంది. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యశాఖ అధికారులు దీనిపై ఇంతవరకు ఎలాం టి కార్యాచరణ రూపొందించలేదు. ప్రతీయేటా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50 కోట్ల విలువైన చేపల ఉత్పత్తి జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఐదువేలకు పైగా చెరువులతో పాటు జూరాల, కోయిల్‌సాగర్, శ్రీశైలం, సంగంబండ, భూత్పూర్, జొన్నలబొగుడ, సరళాసాగర్, ఎల్లూరు, డిండి వంటి రిజర్వాయర్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ సీజన్‌లో ఆయా చెరువులు ప్రాజెక్టుల్లో సుమారు రూ.తొమ్మిది కోట్ల చేపపిల్లలను ఉచితంగా వదిలారు.



చేప పిల్లలు

పశ్చిమగోదావరి నుంచే దిగుమతి..

గతంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాల నుంచి వచ్చినవి సరిపోక 50 శాతం ప్రైవేటుగా టెండర్ల ద్వారా చేపపిల్లలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ ఏడాది జిల్లాకు అవసరమైన చేపపిల్లలను టెండర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా నుంచి దిగుమతి చేసి పంపిణీ చేస్తారు. మత్స్య సహకార సంఘాల సొసైటీల ఆధ్వర్యంలో చేపలను పెంచి అమ్ముకుని ఆదాయం పొందుతారు. గతేడాది ఉమ్మడి జిల్లా పరిధిలోని చెరువులు, ప్రాజెక్టులకు రూ.తొమ్మిది కోట్ల విలువైన చేపపిల్లలు పంపిణీ చేశారు. అందులో రవుట, బొచ్చ, బంగారుతీగ, దోబూచ వంటి రకాల చేపపిల్లలను వదిలారు. ఒక్కో చేపపిల్ల రూ.30 పైసల నుంచి రూపాయి న్నర వరకు పెట్టి కొనుక్కుని తీసుకొచ్చారు. ప్రతీ జిల్లాలో రెండు నర్సరీ కేంద్రాల్లో చేపపిల్లలను అభి వృద్ధి చేసి మత్స్యశాఖ పంపిణీ చేస్తోంది. ప్రభు త్వం తరఫున ఉమ్మడి జిల్లాలో ఐదు సీడ్ ఫామ్‌లు అభివృద్ధి చేయాలని ప్రణాళికలు ఉన్నప్పటికీ చంద్రసాగర్, కోయిల్‌సాగర్‌లో మాత్రమే పని చేస్తున్నాయి.

ప్రభుత్వం నిధులు కేటాయించలేదు



మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది 1,091 చెరువులు, రిజర్వాయర్ల లో సుమారు ఒక కోటి 93 లక్షల 78 వేల చేప పిల్లలను వదిలారు. ఈ ఏడాది జిల్లాలో చేప పిల్లల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రారంభం కా లేదు. దానికోసం ప్రభుత్వం ఇంకా నిధులు కే టాయించలేదు. ఈఏడాది జిల్లాలోని 1,091 చె రువుల నుంచి రూ.రెండు కోట్లు చేపపిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించగానే జూలైలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి మత్స్య సొసైటీలకు చేపపిల్లలను పంపిణీ చేస్తాం. ఉమ్మడి జిల్లాలోని ఐదు సీడ్ ఫామ్‌లలో కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయి.

- డి.రాధారోహిణి, జిల్లా మత్స్యశాఖాధికారి, మహబూబ్‌నగర్

రైతు భరోసా అమలుపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



వెల్దండలో విలేకరులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వెల్దండ, జూన్ 30 : తెలంగాణ రైతాంగం ఎదురు చూస్తున్న రైతు భరోసా అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యవ సాయ సీజన్ దాటుతున్నా రేవంత్ సర్కార్ మాత్రం రైతు భరోసా విషయంలో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కేవలం వితండవాదం, అసమర్థ, అవగాహనలేని ప్రభుత్వం కొనసాగుతుందని మండిపడ్డారు. ఇప్పటివరకు రైతు భరోసా అమలుపై వివరాలు బయటపెట్టాలని సూచించారు. రైతుల పట్ల ఉదారత ఉండాలని, కార్పోరేటు సంస్థలకు లేని ఇబ్బంది రైతులకు ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా అనర్హులు ఉంటే వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుతీరు బాగాలేదని భావించినప్పుడు, అధికారం మీచేతుల్లో ఉంది కదా వెంటనే సవరించి అమలుచేయాల్సిన బాధ్యత మీకులేదా అని విమర్శించారు. సమైఖ్యాంధ్రలో తెలంగాణ రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఇప్పుడు పథకం అమలుపై కొర్రీలు పెట్టడం ఎందుకన్నారు. భవిష్యత్తులో కొత్త రేషన్‌కార్డుల మాటేమోగాని ఉన్నవాటిని తొలగించే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. రుణమాఫీపై నిబంధనలు పెట్టడం సరికాదని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కూన కిష్టమ్మ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

సమావేశంలో కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నిరంజన్, శ్రీను, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా జిల్లా స్థాయి కోలాటం పోటీలు

- కళాకారులతో భారీ ర్యాలీ



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జానపద కోలాటం కళాకారులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 30: తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కోలాటం పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా వందలాది మంది కోలాటం కళాకారులతో పట్టణంలోని నాగనూలు చౌరస్తా నుంచి కోలాటం నృత్య ప్రదర్శన చేస్తూ శ్రీపురం చౌరస్తా మీదుగా అంబేడ్కర్ విగ్రహం వద్దను చేరుకుని అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి సాయి గార్డెన్ చేరుకుని కోలాటం పోటీలు నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన కోలాటం కళాకారులు వివిధ రీతుల్లో ప్రదర్శించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జానపద కోలాటం కళాకారుల సంఘం జిల్లా నాయకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ వైరు

- పట్టించుకోని సంబంధిత అధికారులు



కొరటికల్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన స్తంభం

ఉప్పునుంతల, జూన్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలోని కృష్ణారెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం గత నెల రోజుల కిత్రం గాలి వానలకు విరిగి ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లకు వేలాడుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. నెల రోజులు గడుస్తున్న విరిగిన స్తంభం తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే గాలీవానలకు వైరు తెగి కింద పడే అవకాశాలు లేకపోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే విధంగా అధికారులు చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

ధరూరు, జూన్ 30 : గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామానికి చెందిన బసన్నపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.... గ్రామానికి చెందిన బసన్న సమీంలోని ఇంటి వద్ద శనివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఆ కుటుంబానికి చెందిన వ్యక్తులు అతడిపై రాళ్లు, కర్రలతో దాడిచేశారు. దీంతో బసన్న కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు చేరుకుని సంఘటనపై వివరాలు సేకరించారు. అనంతరం బాధితుడిని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. బసన్న భార్య సుజాత ఫిర్యాదు మేరకు శ్రీకాంత్, రాధాకృష్ణ, మహదేవ్, మహేష్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అలంపూర్ చౌరస్తా, జూన్ 30: గద్వాలజిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో జాతీయరహదారిపై ఆదివారం ముందు కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్లు ఉండవల్లి హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 40మంది ప్రయాణికులతో కర్నూలు వైపు వెళ్తుండగా టోల్‌ప్లాజాకు సమీపంలో ముందు వెళ్తున్న కారును ఓవర్‌టెక్ చేయబోయి టక్కర్ ఇచ్చింది. దీంతో కారు డ్యామేజీ కావడంతో కారులో ఉన్న సురేష్ పోలీసులకు పిర్యాదు చేయడంతో బస్సు డ్రైవర్ రాముడుపై ఎస్సై శ్రీనివాస్‌నాయక్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



శ్యాంసన్(ఫైల్)

వడ్డేపల్లి, జూన్ 30 : గద్వాల జిల్లా శాంతినగర్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి శ్యాంసన్ (23) ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆంజనేయులు, సుశీలమ్మ దంపతుల ఇద్దరు కుమారుల్లో చిన్నకుమారుడు శ్యాంసన్ బీటెక్ చివరి సంవత్సరం చదవుతున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్యాంసన్ మృతి చెందాడు. బంధువులతో పాటు తోటి స్నేహితులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అలంపూర్ చౌరస్తా, జూన్ 30: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామ శివారులో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు నగరానికి చెందిన కొంతమంది వ్యక్తులు పుల్లూరు గ్రామ శివారులోకి వచ్చి పేకాట ఆడుతుండగా పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి దాడులు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 24,560లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎవరికి వారే..ఆడుకోండి

- స్టేడియంలో శిక్షకుల కొరత
- పలు క్రీడలకు కోచ్‌లు లేని వైనం
- సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో

చిన్నారుల సాధన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 30 : ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో శిక్షకుల కొరత నెలకొంది. దీంతో క్రీడాకా రులు ఎవరికి వచ్చిన ఆట వారు ఆడుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.2.50 లక్షలతో ప్రధాన స్టేడియం ఆధునికీకరణతో పాటు, రూ.6.99 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇండోర్ స్టేడియం కల నెరవేరింది. బాస్కెట్‌బాల్, షటిల్ బ్యా డ్మింటన్, బాక్సింగ్, జూడో, టేబుల్‌టెన్నిస్, నెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించుకోవచ్చు. అభివృద్ధి చేసిన స్టేడియం మైదానంలో కోచ్‌ల కొరత మాత్రం తీరడం లేదు. గత 18 ఏళ్ల నుంచి ప్రధాన సమస్య కోచ్‌లదే కావడం విశేషం. దీంతో ఔత్సాహిక క్రీడాకా రులు ఆందోళనకు గురవుతున్నారు.

కోచ్‌లు కరువు

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో పలు క్రీడలకు కోచ్‌లు లేని వైనం ఉంది. దీంతో క్రీడాకా రులు నిరాశకు గురవుతున్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, వాలీబాల్, స్విమ్మింగ్‌లకు మాత్రమే కోచ్‌లు ఉన్నారు. ఖేలో ఇండియా సెంటర్‌లో ఫుట్‌బాల్ కోచ్ మాత్రమే ఉన్నారు. హకీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్ తదితర క్రీడా అంశాలకు కోచ్ లేకపోవ డంతో క్రీడాకారులకు సాధన చేయడం ఇబ్బందిగా మారింది. గతంలో అనేకమార్లు జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకవెళ్లినా సమస్య తీరలేదు. ప్రధాన స్టేడియంలోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లాలోని మిగతా స్టేడియాల్లో కోచ్‌లు లేరు. వేసవిలో కేవలం నెల రోజులు మాత్రమే వివిధ క్రీడా అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో స్టేడియం కళకళలాడుతూ ఉంటుంది.

ఉన్నత వనరులతోనే వెలుగులోకి వస్తున్న క్రీడాకారులు

జిల్లాలో వివిధ క్రీడా అంశాల్లో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. జిల్లాలోని క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎంతోమంది క్రీడాకారులు శిక్షణ పొంది వెలుగులోకి వస్తున్నారు. జిల్లా యువ జన, క్రీడా శాఖకు సంబంధించి స్టేడియాల్లో ప్రతీ క్రీడకు సంబంధించి కోచ్‌ల నియామకం చేపడితే ఎంతోమంది క్రీడాకారులను తయారుచేసే అవకాశం ఉంది. ఇప్పటికే కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్)కు జిల్లా క్రీడాశాఖ అధికారి ప్రతిపాదనలు పంపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా క్రీడాకారుడే కావటంతో జిల్లా కేం ద్రంలోని స్టేడియంలో కోచ్‌ల కొరతతో పాటు, క్రీడాభి వృద్ధి జరుగుతుందని క్రీడా సంఘాలు, క్రీడాకారులు ఆశతో ఉన్నారు.



మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియం



అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్న డీఎస్‌ఏ కోచ్ సునీల్

జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదు..



జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదు. ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిం చారు. జిల్లా కేంద్రంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ప్రధాన స్టేడి యం అందుబాటులో ఉన్నాయి. కోచ్‌ల నియామ కం చేపట్టాలి. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారుడు కా బట్టి కోచ్‌ల నియామకం, క్రీడాభివృద్ధి జరుగుతుం దని నమ్మకం ఉంది.

- దూమర్ల నిరంజన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

కోచ్‌లను నియమించాలి



స్టేడియంలో మైదా నాలు అందుబాటులో ఉన్నా కోచ్‌ల కొరత ఉంది. కోచ్‌ల నియామ కం చేపడితే ఔత్సాహి క క్రీడాకారులకు సరైన శిక్షణ ఇవ్వవచ్చు. కోచ్ లను నియమించాలని మరోసారి ప్రజా ప్రతి నిధులు, క్రీడా శాఖ అధికారులను కలుస్తాం.

- శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రతిపాదనలు పంపించాం



జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంతో పాటు ఎంవీఎస్ ఇండో ర్ స్టేడియంలో కోచ్‌ల నియామకం కోసం స్పో ర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలం గాణ(శాట్)కు ప్రతిపా దనలు పంపించాం. స్టే డియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్‌కు కోచ్‌లు, ఖేలో ఇండియా సెంటర్‌లో ఫుట్‌బాల్ కోచ్ ఉన్నా రు. త్వరలో కోచ్‌ల నియామకం జరుగుతుంది.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో

ఘనంగా ధ్వజారోహణం, సుదర్శన హోమం



ఆలయంలో సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 30 : గోదాదేవి సమేత అనందగిరి లక్ష్మి వెంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం 2వ రోజు వేద పండితులు ఉదయం వేద పారాయణం, ప్రబంధ పారాయణం చేపట్టారు. అశేష భక్తజన సమూహంతో ధ్వజారోహనం ఘనంగా నిర్వహించారు. అనంతరం సంతాన ప్రాప్తి కోసం దంపతులకు గరుడ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సుదర్శన హోమం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర నామ పారాయణం, బలిహరణం, గరుడ వాహన సేవ, ఎదుర్కోలు కనుల పండువగా చేశారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఏకపాత్రాభినయం నాటకం భక్తులకు ఆకట్టుకున్నది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి సమేత లక్ష్మి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి కల్యాణానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అన్నదానం చేపట్టినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

'గోకారం పెద్దచెరువును పునరుద్ధరించాలి'

చారకొండ, జూన్ 30: మండలంలోని గోకారం పెద్ద చెరువును పుణరుద్ధరించాలని సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మండలంలోని గోకారం పెద్ద చెరువును రిజర్వాయరు నిర్మిస్తామని ఉన్న చెరువును పూర్తిగా తొలగించారని అన్నారు. ప్రస్తుతం చెరువును పూర్తిగా తొలగించడంతో నీళ్ల నిల్వ లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కింద దాదాపు 1200 ఎకరాలకు సాగు నీరు అందేదని, ఏడాదికి రెండు పంటలు రైతులు సాగు చేసేవారని పరిసర ప్రాంతాల గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగేవని అన్నారు. ఉన్న చెరువు కట్టను తొలగించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చంద్రాయన్‌పల్లి, గోకారం గ్రామాలకు చెందిన మత్స్య కార్మికులు దాదాపు 300 మందికి పైగా జీవనోపాధి పొందేవారని అన్నారు. గోకారం పెద్ద చెరువును పుణరుద్ధరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రం అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సీపీఐ గ్రామ కార్యదర్శి ఏసారపు ఆశోక్‌గౌడ్, రైతుసంఘం మండల అధ్యక్షుడు మద్ది నారయణరెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మొగిళ్ల శ్రీను, షైబెలి, గుండె ముత్యాలుగౌడ్, జెల్ల బాలయ్యగౌడ్ తదితరులున్నారు.

ప్రకృతి ఆరాధనతో మానవాళికి శ్రేయస్కరం



పాలెం అభయ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 30 : ప్రకృతిలోని మొక్కలను కాలానుగుణంగా ఆరాధిస్తేనే మానవ మనుగడకు శ్రేయస్కరమని అభయ అంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వెల్దండ సురేష్ అన్నారు. మండలంలోని పాలెంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని మొక్కలకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి ప్రకృతి చేసే మేలును గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఔషధ గుణాలున్న మొక్కలకు నిత్యం నీళ్ళు, ఎరువులు వంటి పనులు చేస్తూ వాటితో మమేకమై జీవనం సాగిస్తుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. పూర్వీకులు ప్రకృతిని ఎక్కువగా ఆరాధించేవారని అందుకే వారు నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవించారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు రాంచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పలువురు భక్తులు మొక్కలను నాటారు. ఆయన వెంట ఆలయ సభ్యులు విటల్, వినయ్, లక్ష్మణ్, సోమ ప్రగతి గౌడ్, సుధారాణి, ప్రసాద దాత శివమ్మ, జ్యోతి, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.


రైతు భరోసా పథకంపై చర్చా గోష్టి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్

అమ్రాబాద్ జూన్ 30: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో ఎన్ని ఎకరాలు ఉండాలి అనే విషయాలపైన పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులతో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ చర్చించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన అత్యవసర సర్వసభ్య సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో రైతులు 5 నుంచి 10 ఎకరాల వరకు రైతు భరోసా పథకాన్ని వర్తింప చేయాలని తమ తమ అభిప్రాయాలని వ్యక్తం చేశారు. రైతులు తెలిపిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు ఆయన తెలిపారు. అమ్రాబాద్ ఉమ్మడి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంటల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పలు సూచనలు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ మంగమ్మ, సీఈవో దశరథం నాయక్, డైరెక్టర్లు బుచ్చయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్న గువ్వల

అచ్చంపేటటౌన్, జూన్ 30: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అంతకుముందు కార్యకర్తలు, నాయకులతో కలిసి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులు నర్సింహగౌడ్, రమేష్ రావు, శంకర్ మాదిగ, సురేష్, పిల్లి బాలరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుడికి ఆర్థికసాయం

కల్వకుర్తిటౌన్, జూన్ 30: మునిసిపల్ కార్మికునిగా పనిచేస్తూ ఇటీవల ప్రమాదానికి గురైన చికిత్స పొంది కొలుకుంటున్న వెంకటయ్యను పరామర్శించి ఆదివారం మిత్ర ఫౌండేషన్ సభ్యులు స్పందించి ఇంటికి వెళ్లి రూ.5వేలు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించామన్నారు. ఫౌండేషన్ సభ్యులు, మునిసిపల్ కార్మికులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, జూన్ 30: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అధ్యక్షతన మహాజన సభ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆగస్టు 15 లోపే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రైతు భరోసా పథకం అమలుపై రైతులు తమ సలహాలు, సూచనలను ఎమ్మెల్యే వంశీకృష్ణకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణకు పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, డైరెక్టర్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. జిల్లా సహకార శాఖ అధికారి రఘునందన్‌రావు, డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ భాగ్యమ్మ, పీఏసీఎస్ సీవో వెంకటయ్య, పీఏసీఎస్ డైరక్టర్లు జగన్‌మోహన్, కొండలయ్యగౌడ్, పాండు, రాజయ్య, పీఏసీఎస్ సిబ్బంది భీమయ్యగౌడ్, ఏఈవోలు వంశీ, రేణుక, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బలరాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరటి శివ, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, జెల్ల కృష్ణయ్యగౌడ్, చంద్రశేఖర్, అశోక్ గౌడ్, పాండుగౌడ్, జేసీబీ వెంకటయ్య గౌడ్, గుండె శివగౌడ్, గజ్జె కొండల్‌గౌడ్, బాడిగ జనార్ధన్‌గౌడ్, శ్రీపతిరావు, జేపాల్, సహదేవ్, దశరథం, ఆరేళ్ల పర్వ తాలుగౌడ్, పల్సి వెంకటయ్యగౌడ్, ప్రశాంత్‌నాయక్, కుకుడాల శ్రీను, నర్సింహరెడ్డి, రత్నా రెడ్డి, వెంకట్‌రెడ్డి, బిందాస్‌నాయక్, లక్ష్మయ్య రైతులు పాల్గొన్నారు.

పండించే ప్రతీ ఎకరాకు రైతు భరోసా అందిస్తాం

అచ్చంపేటటౌన్: పండించే ప్రతీ ఎకరాకు రైతు భరోసా అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాజన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో గుట్టలకు, బీడు భూములకు, రోడ్లకు రైతు బంధు ఇచ్చేవారని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకు పంటలు పండే భూములకు మాత్రమే రైతు భరోసా అందిస్తామన్నారు. రైతు భరోసా పథకంలో రైతుల భాగస్వామ్యం ఉంటుందని వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి చర్చించడం జరుగుతుందన్నారు. రైతుల అభ్యర్థన మేరకే రైతు భరోసా అందజేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ప్రజా పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ సమీవేశంలో పాల్గొన్నారు. సింగిల్‌విండో చైర్మన్ మందాడి రాజిరెడ్డి, జడ్పీటీసీ మంత్రియ నాయక్, డైరెక్టర్లు, కౌన్సిలర్లు గౌరీశంకర్, నాయకులు రామనాథం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాడి, భూ ఆక్రమణపై విచారణ జరిపించాలి

- దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- బాధిత కుటుంబానికి రూ. 50లక్షల పరిహారం ఇవ్వాలి
- సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు



భ్రమరాంబ కాలనీ చెంచులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కొల్లాపూర్, జూన్ 30 : కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి భ్రమరాంబ చెంచు కాలనీకి చెందిన చెంచు మహిళ కుటుంబంపై జరిగిన దాడి, భూ ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా బృందం చెంచు పెంటను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ చెంచులపైన జరిగిన అఘాయిత్యాలను చూస్తుంటే సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కొంత మంది పైననే కేసులు పెట్టి ఇతరులపైన కేసులు పెట్టకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ ఘటనపై, నాగన్న హత్యపైన సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆ గ్రామంలో చెంచులకు ధైర్యమిచ్చే విధంగా పోలీస్ పికెటింగ్ పెట్టి అక్కడ ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి బి.శివవర్మ, పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి ఎం.దశరథం, మండల కమిటీ సభ్యులు ఎండి.సలీం, బి.బాలపీరు, ఎన్.కిరణ్‌కుమార్, జల్లాపురం సురేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హనుమంతు, బత్తిని రాజు, సంజీవ్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎన్.బాలునాయక్, బంకల సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు కిడ్స్ సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపికలు



కల్వకుర్తిలో క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు

కల్వకుర్తి, జూన్ 30 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. కల్వకుర్తి సమీపంలోని సీబీఎం క్రీడా మైదానంలో కిడ్స్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడలపై ఎంపికలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు పాల్గొని జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక వికాసం చేకూరుతుందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఉన్నత ఉద్యోగులు సాధించవచ్చని సూచించారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 150మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పరుశరాముడు, పీడీ అంజయ్య, ఎండి.తురబ్, మల్లేష్, చంద్రశేఖర్, కరుణాకర్, సుదర్శన్, రాజేందర్, సైదులు, మల్లేష్, కానిస్టేబుల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



వంగూరు మండలంలోని ప్రభుత్వఉన్నత పాఠశాలకు చెందిన 1997-1998 సంవత్సరంలో పదోతరగతి విద్యార్థులు

కల్వకుర్తిటౌన్, జూన్ 30 : పట్టణంలోని కేబీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1997-1998 సంవత్సరంలో వంగూరు మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తిచేసిన పూర్వవిద్యార్థులు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించి ఆ రోజుల్లో వారుచేసిన అల్లరిచేసిన విధానం, ఉపాధ్యాయులు పాఠాలు చెప్పిన తీరును జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మండలంలోని రఘుపతిపేట గ్రామంలో 1998 - 1999 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వవిద్యార్థులు

రఘుపతిపేట గ్రామంలో...

మండలంలోని రఘుపతిపేట గ్రామంలో 1998-1999 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు, ఆ రోజుల్లో విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా పూలమాలలతో సత్కరించి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి వచ్చిన స్నేహితులను ఒకరినొకరు ప్రేమగా పలకరించుకున్నారు. పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిల ప్రభుత్వ పాఠశాలలో భోజనశాల ప్రారంభం

- సోమశిల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మంత్రి జూపల్లి రూ.5లక్షలు మంజూరు



సోమశిల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో భోజనశాలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కొల్లాపూర్, జూన్ 30 : కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో దివంగత డీఎస్పీ క్యారసాని మురళి గతంలో ఇచ్చిన రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులకనుగుణంగా భోజనశాల ఏర్పాటు, వంటసామగ్రి కొనుగోలు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ పేర్కొన్నారు. ఆదివారం భోజనశాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలు హాజరయ్యారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. భోజనశాలను మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సోమశిల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన నిధుల నుంచి 5లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కారసాని మురళి ఆకస్మిక మరణం తనను తీవ్రంగా బాధించిందని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సోమశిల ప్రభుత్వ పాఠశాల యూపీఎస్‌కు తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల పక్షాన 10వేలు అందజేస్తున్నట్లు ప్రకటించారు.

తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను తాను ఎల్లప్పుడూగౌరవిస్తానని, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత అదేస్థాయిలో ఉపాధ్యాయులను గౌరవిస్తానని వెల్లడించారు. తాను ఉపాధ్యాయులుతో కలిసి సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సప్తనదుల సంగమం సంగమేశ్వరాలయాన్ని దర్శించి పూజలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. సీఐ జగదీశ్, మాజీ సర్పంచ్‌లు బ్యాంగి మద్దిలేటి, కాంగ్రెస్ నాయకులు బోయ నరసింహ, రెవెన్యూ ఉద్యోగి, సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయ చైర్మన్ గోవిందురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు బ్యాంగి కృష్ణ ప్రసాద్, వెంకట్‌రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణశర్మ, దివంగత డీఎస్పీ కారసాని మురళి కుమారులు పృథ్వీ, తమ్ముడు సురేష్‌లతో పాటు గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు రూ.లక్ష ఆర్థిక సహాయం

కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలోని భ్రమరాంబ కాలనీకి చెందిన చెంచు మహిళపై దుండగులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి జూపల్లి ఆమెకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చెంచు మహిళ ఆరోగ్య పరిస్థితిపై మంత్రి జూపల్లి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు ధైర్యంగా ఉండాలని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నివిధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వం తరపున లక్ష రూపాయల చెక్కును బాధిత మహిళకు అందజేస్తూ మరో మూడు లక్షల రూపాయల చెక్కును త్వరలోనే అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అమానవీయ సంఘటనలకు ఎవరూ పాల్పడిన దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని జూపల్లి తెలిపారు. అదేవిధంగా బాధిత మహిళా పిల్లలకు ఉచిత విద్యతో పాటు అందుకయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వం అందిస్తుందని ఆమెకు మంత్రి జూపల్లి హామీ ఇచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలస్వామిగౌడ్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ జడ్పీటీసీ బాలస్వామిగౌడ్, సింగం నాగేష్‌గౌడ్

కల్వకుర్తి, జూన్ 30 : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మాజీ జడ్పీటీసీ సింగం బాలస్వామిగౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేష్‌గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆదివారం సీఎంకు శాలువా, బొకేతో సత్కరించారు. కల్వకుర్తి ప్రాంతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని మంజూరు చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపినట్లు బాలస్వామి గౌడ్, నాగేష్‌గౌడ్‌లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కల్వకుర్తి, జూన్ 30 : శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవ రెడ్డి కోరారు. ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు ఫోన్లను పోలీస్ పోర్టల్ సీఈఐఆర్ ద్వారా గుర్తించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో పోగొట్టుకున్న ఐదు ఫోన్లను బాధితులకు ఆదివారం ఎస్ఐ మాధవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమానాస్పదంగా కన్పించే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్లను గుర్తించేందుకు కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్ఐ మాధవరెడ్డి అభినందించారు. ఏఎస్ఐ హనుమంతురెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఉప్పల వెంకటేశ్



హరీశ్‌రావును కలిసి సన్మానిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, జూన్ 30 : రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని పూలమాల శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ అంశాలను మాజీ మంత్రి హరీశ్‌రావుతో చర్చించడం జరిగిందని ఉప్పల వెంకటేశ్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీశైలం గౌడ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నరేష్‌గౌడ్, ప్రశాంత్, కోటేష్, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

'బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి'

వంగూరు, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేసి సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం వంగూరులో విలేకర్లతో మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా 500 బొగ్గు గనులు ఉంటే ఇప్పటికీ 300 బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయడం జరిగిందని విమర్శించారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

వంగూరు జూన్ 30: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో పరోక్షంగా బీజేపీకి ఓట్లు వేయించారని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేమారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొండారెడ్డిపల్లిలో వెయ్యి ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నేత హరీష్‌రావు లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. కడారి జంగయ్య, రాఘవేందర్, వంశీ ఉన్నారు.

ఉపాధి హామీ పథకంలో సోషల్ ఆడిట్

ఉప్పునుంతల, జూన్ 30: ఉప్పునుంతల మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు ఒక సంవత్సరం కాలంలో ఖర్చు రూ.4 కోట్లు 80 లక్షలు చేశారు. వీటిపై సోషల్ ఆడిట్ టీం తనిఖీలు చేస్తున్నట్లు ఏపీవో సుదర్శన్‌గౌడ్ తెలిపారు.

అర్హులకు రైతు భరోసా అందించాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు

వెల్దండ, జూన్ 30 : నిజమైన రైతులకు అర్హతగల వారికి రైతుభరోసా అందించాలని రైతులు అభిప్రాయపడ్డారు. ఆదివారం వెల్దండ సింగిల్‌విండో కార్యాలయంలో రైతుభరోసా అమలుపై రైతుల అభిప్రాయసేకరణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కోఆపరేటివ్ అధికారి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, చైర్మన్ జూపల్లి బాస్కర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎటువంటి ఐటీ నిబంధనలు పెట్టరాదని సూచించారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా రైతు భరోసా అందించాలని కోరారు. కార్పొరేట్లకు లేని నిబంధనలు రైతులకు ఎందుకు పెడుతున్నారని రైతులు ప్రశ్నించారు. ఎంపీటీసీ మోతీలాల్, సీఈవో శ్రీనివాసులు, డైరెక్టర్లు, నాయకులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

కోడేరు, జూన్ 30 : బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటనలో గాయపడిన బాధితులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. కోడేరు మండల కేంద్రానికి చెందిన డ్యాగ చిన్నమ్మ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను ఆయన ఆదేశించారు. ప్రమాదవశాత్తు క్షతగాత్రులైన బాధితులను ప్రభుత్వపరంగా చికిత్స అందించి అండగా ఉంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని జూపల్లి అన్నారు. పెద్దకొత్తపల్లి ఎంపీపీ ప్రతాప్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: కోడేరు మండల పరిధిలోని జనుంపల్లి శివారులో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో గాయపడిన కూలీలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆదివారం పరామర్శించారు.

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట గుమ్మకొండ రమేష్, ఏదుల కృష్ణగౌడ్, పరమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.